సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురంలో 10కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితులను తీసుకువస్తుండగా వాహనానికి పంక్చర్ అయ్యింది. - 8లో



పాకశాలలో ప్లాంట్

శ్రీముఖలింగంలో పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనిపై విమర్శలు వస్తున్నాయి. - 8లో

పోలీసులకు మెగా వైద్య శిబిరం

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసులు, వారి కుటుంబాల కోసం ఈ నెల 28న జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 29న టెక్కలి సబ్‌డివిజన్, 30న కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో వైద్య శిబిరం, బ్లడ్ క్యాంపులు ఉంటాయని తెలిపారు.

జనం మాట

బాబు పాలన అంటే పెరుగుదలే



చంద్రబాబు పాలన అంటే పేదలపై భారం పడుతుందని అన్నివర్గాల ప్రజలు బలంగా నమ్ముతారు. ఐదు నెలల్లో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు ఇప్పుడు విద్యుత్ ధరలు.. కచ్చితంగా ఇది పేదల నడ్డి విరవడమే.

– దామ మన్మధరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షులు, పాగోడు, జలుమూరు మండలం

బిల్లులు కట్టలేం



విద్యుత్ బిల్లులు పెరిగితే కుటుంబానికి ఆర్థిక బారం పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచడాన్ని విరమించుకోవాలి. ఇప్పటికే కూరగాయల రెట్లు పెరిగిపోయాయి. దానికి తోడు విద్యుత్ బిల్లులు పెరిగితే ఇబ్బందులు తప్పవు.

– కుప్పిలి జానకమ్మ, విద్యానగర్, పాతపట్నం

నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. ఆదిలోనే ఇలా ఉంటే ఇక రానున్న నాలుగున్నరేళ్లు ఎలా ఉంటుందో తలుచుకుంటేనే భయమేస్తోంది. ప్రజలపై భారం లేకుండా చార్జీల పెంపు ప్రభుత్వమే భరించాలి.

– మీసాల రజనీ, ఎంపీటీసీ సభ్యులు హిరమండలం

మోసం చేయడం ఆయన నైజం



ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ఉన్న విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారు.


– ఏవీ సురేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, హిరమండలం



పెంపు ఉండదన్నావ్ బాబూ..

'భవిష్యత్‌లో విద్యుత్‌చార్జీల పెంపు ఉండదు. కుదిరితే ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల నుంచి చార్జీలు తగ్గిస్తాం.'

–ఏప్రిల్ 23న టెక్కలి, శ్రీకాకుళం ఎన్నికల సభల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇదీ.



సర్దుబాటు.. సామాన్యుడికి వెన్నుపోటు

- జనం నెత్తిన సర్దుబాటు చార్జీల భారం
- యూనిట్ విద్యుత్‌పై గరిష్టంగా రూ.1.55 అదనం
- 2026 జనవరి వరకు వడ్డింపులు
- జిల్లాలో 7.88 లక్షల మంది వినియోగదారులపై ప్రభావం
- విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని విస్మరించిన చంద్రబాబు

అరసవల్లి:

విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మళ్లీ అలవాటు ప్రకారం మాట మార్చారు. సర్దుబాటు పేరుతో జనాలకు వెన్నుపోటు పొడిచేందుకు కత్తి నూరుతున్నారు. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీల (ఎఫ్‌పీపీసీఏ) పేరిట వినియోగదారుల నుంచి మరో 15 నెలల పాటు అదనపు వసూలు చేసుకునేలా ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి నుంచి ఈపీడీసీఎల్‌కు అనుమతులు రావడంతో సామాన్యుడికి ప్రతి నెలా షాక్ తగలనుంది. వాస్తవానికి ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చును ప్రభుత్వం భరిస్తే చార్జీల పెంపు అన్నదే ఉండదు. కానీ ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ కూటమి సర్కార్ చేతులెత్తేయడంతో విద్యుత్ చార్జీల భారం జనం నెత్తిపై పడుతోంది.

రానున్న 15 నెలల పాటు అంటే ఈ ఏడాది నవంబర్ నుంచి 2026 జనవరి వరకు అమలు కానున్న ఈ అదనపు భారంతో ప్రజల నెత్తిన విద్యుత్ షాక్ ఇచ్చేలా సర్కార్ చర్యలకు దిగింది. ఈ క్రమంలో గరిష్టంగా యూనిట్‌కు రూ.1.55 వరకు విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు రావడంతో జిల్లా వ్యాప్తంగా జనాల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఇలా సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎలాగైనా ఇంధన ఖర్చు సర్దుబాటు చార్జీలను వసూలు చేసుకునేలా ఇప్పటికే సర్కార్ సూచనల మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదించిన మేరకు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి.

జిల్లాలో రూ.3 కోట్లు భారం

జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో మొత్తం 7,88,078 విద్యుత్ కనెక్షన్లు ఉన్నా యి. వీటిలో హెచ్‌టీ వినియోగదారులు కేవలం 477 మాత్రమే ఉండగా మిగిలిన వారు ఎల్‌టీ వినియోగదారులే ఉన్నారు. కాగా ఇంతవరకు ఈ విద్యుత్ కనెక్షన్ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి నెలకు రూ.97.16 కోట్లు (సెప్టెంబర్ 30 నాటికి) వరకు డిమాండ్ ఉండేది. ఈ ప్రకారం చెల్లింపులు జరిగేవి. ఇందులో సెప్టెంబర్ 2024 నాటి లెక్కల ప్రకారం ఎల్‌టీ వినియోగదారుల నుంచి రూ.49.09 కోట్లు, హెచ్‌టీ వినియోగదారుల నుంచి డిమాండ్ రూ.48.07 కోట్లుగా రికార్డయ్యింది. తాజాగా ఇంధన విద్యుత్ కొనుగోలు సర్దుబాటు చార్జీల పేరిట అదనపు భారం మోపడం ద్వారా ఈ ఆదాయం మరో రూ.3 కోట్ల వరకు పెరిగే అవకాశముంది. దీంతో జిల్లాలో నెలకు డిమాండ్ రూ.100 కోట్లకు పైగా రికార్డు కానుంది. విద్యుత్ వినియోగం పెరిగే క్రమంలో యూనిట్ చార్జీల పెంపు కూడా తోడైతే కచ్చితంగా వినియోదారునిపై భారం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదాహరణకు ఇంతవరకు ఎల్‌టీ (డొమస్టిక్) వినియోగదారుని నెలకు 30 యూనిట్లు లోపు వరకు యూనిట్‌కు ప్రస్తుతానికి రూ.1.90 వసూలు చేస్తున్నారు. తాజాగా ఇంధన సర్దుబాటు చార్జీలతో కలిపి ఇదే యూనిట్‌కు కనిష్టంగా రూ.3.20 వరకు పెరగనుంది. అలాగే 400 యూనిట్ల వరకు నమోదైన వినియోగదారునికి యూనిట్ ధర ప్రస్తుతానికి రూ.9.75 కాగా ఇక యూనిట్ ధర రూ.12.30 వరకు పెరగనుంది.

ఆందోళనలో వినియోగదారులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆర్థిక భారాలను తగ్గించడంలో విఫలం కావడంతోనే విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం తప్పడం లేదు. ఎన్నికల ముందు వరకు విద్యుత్ చార్జీలను పెంచేది లేదంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదారు నెలల్లోపే విద్యుత్ చార్జీల పెంపును అమలు చేస్తుండడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇదే ధోరణి కొనసాగిస్తే సబ్సిడీలను కూడా ఎత్తివేసి బలహీన వర్గాల ప్రజలపై మరింత భారం మోపేందుకు అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సర్దుబాటు చార్జీల పెంపు అంశంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతున్నా విద్యుత్ శాఖాధికారులు మాత్రం నోరుమెదపడం లేదు. ఈ సర్దుబాటు చార్జీలపై ఇంకా ఎలాంటి అధికారిక ఆదేశాలు రాలేదంటూ సమాధానం దాటవేస్తున్నారు.

బాబు మారలేదు



చంద్రబాబుకు ప్రజలను ఎలా నమ్మించి వంచించాలో తెలుసు. 2014–2019 మధ్య అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న బాబు మారుతారని ప్రజలు భావించారు. కానీ బాబు మారలేదు. కూటమి అధికారంలోకి వస్తే ఎలాంటి బిల్లుల పెంపు ఉండబోదని పలు సభల్లో చెప్పిన చంద్రబాబు కూటమి అధికారానికి వచ్చిన 120 రోజుల్లోనే తన విశ్వరూపం చూపించారు. విద్యుత్ బిల్లుల భారం ప్రజలపై మోపడం సరైంది కాదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అది బాబు నైజం



ప్రజలపై పడే భారాన్ని లెక్కచేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం చంద్రబాబు నైజం. ఆదాయమే తప్ప పేదలపై భారం ఆయనకు పట్టదు. గతంలో ఇలాగే విద్యుత్ చార్జీలపై సీపీఎం పోరాడినప్పుడు ముగ్గురు సీపీఎం కార్యకర్తలను కాల్చిన చంపిన ఘనత చంద్రబాబుది. అయినా పోరాటానికి సీపీఎం సిద్ధంగా ఉంది.

– గంగరాపు సింహాచలం, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు, కొత్తూరు

• వంతెన.. అంతేనా..?



వంశధార నదిలో వంతెనల కింద ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం

మడపాం వద్ద వంశధార నదిలో వంతెన కిందనే తవ్వకాలు జరుపుతున్న దృశ్యమిది. అందరి కళ్ల ముందే ఇలా తెగించి తవ్వుకుపోతున్నా.. అధికారులెవరూ కిక్కురుమనడం లేదు. వంతెన కింద తవ్వకాలు చట్ట విరుద్ధం.. కనీసం వంద మీటర్ల అవతలకు వెళ్లి ఇసుక తవ్వకాలు చేయాలి. కానీ ఇక్కడ నిబంధనలు పట్టించుకోకుండా వంతెన కిందే ఇసుక తవ్వుకుంటూ పోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వంతెనకు ముప్పు తప్పదు

– నరసన్నపేట



మూడు వంతెనల కింద జోరుగా ఇసుక తవ్వకాలు

• బాణసంచా అనుమతులు తప్పనిసరి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా, మందుగుండు సామగ్రి నిల్వలు, తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. భద్రతా ప్రమాణాలు, ఇసుక, ఫైర్ ఇంజిన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, విక్ర య దుకాణాలు ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, దుకాణానికి దుకాణానికి మధ్య ఐదు నుంచి పది అడుగుల దూరం ఉండాలని సూచించారు. అక్రమ నిల్వలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడువులోగా నదుల అనుసంధానం పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నాగావళి, వంశధార నదుల అనుసంధానం జూన్ 2025 నాటికి పూర్తిచేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పలు ప్రాజెక్టుల ముఖ్య అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. నదుల అనుసంధానానికి ఇప్పటికే రూ.106 కోట్లు ఖర్చు చేసి 75 శాతం పనులు పూర్తి చేసినట్లు వివరించారు. కొద్దిపాటి భూసేకరణ సమస్యలు పూర్తిగా పరిష్కరించి గడువులోగా ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామని చెప్పారు. జిల్లాకు జీవనాడి, వ్యవసాయ రంగానికి ప్రధాన ఆయువు పట్టు బి.ఆర్.ఆర్.వంశధార ప్రాజెక్టు స్థితిగతులపై చర్చించారు. గొట్టా బ్యారేజ్ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఏడాది నీటిని పంపుల ద్వారా రిజర్వాయర్‌కి తరలించి 19 టీఎంసీల నీటిని నిల్వ ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీఓలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ స్వర్ణ కుమార్, ఈఈ శేఖర్, హిరమండలం రిజర్వాయర్ డీఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకునిపై పోక్సో కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: బాలికపై లైంగిక దాడి కేసులో కొయ్యాం పంచాయతీ కొత్తకూర్మినాయుడుపేటకు చెందిన బీజేపీ నాయకుడు, అనుచరుడు ఇద్దరిపై పోక్సో చట్టం కింద ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో కేసున మోదైంది. లైంగికదాడిపై మే 25న పోలీసులకు ఫిర్యాదు అందింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు విచారణను నీరు గార్చుతూ వచ్చారు. ఫిర్యాదుదారు ఎఫ్ఐఆర్ కోసం వెళ్లినా ఇవ్వలేదు. చివరకు ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదలవలస చిరంజీవిని సంప్రదించగా, ఆయన హైకోర్టులో కేసువేశారు. దీంతో బాధితురాలికి ఎఫ్ఐఆర్ ఇచ్చారు. నిందితులను ఇంకా అరెస్టు చేయలేదు. పెద్ద మనిషిగా చలామణి అవుతున్న 60 ఏళ్లు దాటిన వ్యక్తి బాలికపై లైంగిక దాడి చేశారన్న విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

టీడీపీ వారిపై కేసులెందుకు కట్టరు..?

- పోలీసులకు మాజీ మంత్రి సీదిరి సూటి ప్రశ్న
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తను వేధించడంపై నిలదీత



మందస పోలీసు స్టేషన్ వద్ద నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, పోలీసులు ఎందుకు వారిపై చర్యలు చేపట్టడం లేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పోలీసులను ప్రశ్నించారు. మందసలోని పోలీస్‌స్టేషన్‌కు ఆయన శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో వచ్చి ఎస్ఐ ఖాదర్ బాషాను కలిసి మాట్లాడారు. పిడి మందస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గుంపు జగదీష్ సోషల్‌మీడియాలో పలాస అత్యాచార ఘటన నిందితుల కుటుంబసభ్యులకు సంబంధించిన ఫొటోలు షేర్ చేశారంటూ.. ఆయన ఇంటికి పోలీసులు వేకువజామున ఐదు గంటలకు చేరుకుని మాట్లాడడం సరికాదని అన్నారు. కేసు పెట్టినా, విచారణ చేపట్టినా పట్టపగలు చేయాలే గానీ వేకువజామున రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. మందస మండలంలోని మర్రిపాడులో తెలుగుదేశం నాయకులు ఇద్దరు మహిళలపై దాడి చేశారని, గిరిజన గ్రామంలో ఒకరిపై కత్తితో దాడి చేశారని ఇవన్నీ జరుగుతున్నా కేసులు నమోదు చేయడం లేదని అన్నారు. ఎస్ఐ ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎంఎల్‌సీ కాలేదని చెప్పడంతో వారి ముందే డాక్టర్‌కు ఫోన్ కాల్ చేయగా ఎంఎల్‌సి రిపోర్టు ఇచ్చేశామని చెప్పడంతో ఎస్ఐ సమాధానం చెప్పలేకపోయారు. అనంతరం హరిపురం ఆస్పత్రిలో, ఇళ్ల వద్ద ఉన్న బాధితులకు పరామర్శించారు. ఆయనతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మండల పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యారావు, బత్తిని లక్ష్మణరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుసంస్కారం

- తమ బృందంతో మాత్రమే డ్యాన్స్ చేయాలని ఒత్తిడి
- కాదనడంతో తల్లీకూతుళ్లపై అర్ధరాత్రి దారి కాచి దాడి
- బాధితుల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక



తల్లి నాగమణి

కాశీబుగ్గ: అతను ఒకసారి సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయాడు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకుడు. పలాస మండలం తెలుగు మండల యువత అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు.. కానీ తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అర్ధరాత్రి పూట దాడికి ఒడిగట్టాడు. కేవలం తమ బృందాన్ని కాదని వేరే బృందంతో డ్యాన్స్ ప్రోగ్రామ్‌లకు వెళ్తోందన్న కక్షతో వయసు కూడా మర్చిపోయి ఈ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. బాలికతో పాటు ఆమె తల్లిపైనా దాడికి దిగాడు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే అధికార పార్టీ ఒత్తిళ్ల వల్ల కేసు నమోదు చేయడానికి కూడా మొదట వెనుకాడారు. వివరాల్లోకి వెళ్తే..

పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన కిక్కర ఢిల్లీరావు జెస్సీ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ నడుపుతున్నారు. కొర్లాం గ్రామానికి చెందిన ఎం.సుధీష్ణ క్లాసికల్, జానపద, సోలో డ్యాన్సర్‌గా రాణిస్తోంది. ఇటీవల జెస్సీ ఈవెంట్స్‌తో విడిపోయి వేరే డ్యాన్సు గ్రూప్‌లతో ప్రదర్శనలకు వెళ్తోంది. దీన్ని తట్టుకోలేని ఢిల్లీరావు శుక్రవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామంలో నందన్న ఉత్సవాలలో డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చి పలాస వస్తున్న సుధీష్ణ, ఆమె తల్లిని తాళ్లభద్ర వద్ద అడ్డుకుని దాడికి దిగాడు. ఢిల్లీరావు, అనుచరులు బైనపల్లి ప్రణయ్, బైనపల్లి వినయ్, బైనపల్లి చరణ్‌లు కలిసి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారని, తనను జుట్టు పట్టుకుని ఈడ్చుకుపోయారని తల్లి నాగమణి తెలిపారు. తమ సెల్ ఫోన్ విరగ్గొట్టారని తమకు తోడుగా వచ్చిన యువకుడిని కొట్టారని, 100కు, తన భర్తకు ఫోన్‌చేసి చెబితే వారు వచ్చే సమయానికి అందరూ పరారైపోయారని తెలిపారు. శనివారం ఉదయం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకుడి వల్ల తమకు ప్రాణహాని ఉందన్నారు. బాలిక మాట్లాడుతూ ప్రతి రోజూ బైక్‌పై వచ్చి డ్యాన్సులు వేయమంటూ వేధిస్తున్నాడని, వారి ప్రవర్తన నచ్చకే వేరే గ్రూపులతో ప్రదర్శనలకు వెళ్తుంటే దాడి చేశాడని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా శనివారం సాయంత్రం వరకు కేసు నమోదు చేయలేదు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పీఏ పోలీసు స్టేషన్‌కు వచ్చి వెళ్లారని, తమకు న్యాయం జరగాలని తల్లి నాగమణి కోరారు. తల్లి ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై కక్షతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఢిల్లీరావు తెలిపారు.

క్లుప్తంగా

3న కారా మాస్టారు శతజయంతి సెమినార్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో నవంబరు 3న కాళీపట్నం రామారావు మాస్టారు శతజయంతి సెమినార్ శ్రీకాకుళ సాహితి, సాహితీ ప్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ ప్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, సీహెచ్ దివాకర్‌తో పాటు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల కవులు, రచయితలు హాజరవుతారని పేర్కొన్నారు. సాహిత్యాభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: కండక్టర్లుగా అంకితభావంతో పనిచేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఉద్యోగులకు కుటుంబాల్లోని నలుగురికి శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలోని ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఎం.సుగుణమణి (భర్త కె.కాంతారావు డ్రైవర్), ఎంఎల్. నారాయణ (తండ్రి ఎంఎం రావు, డ్రైవర్), ఎస్.సంజయ్ (తండ్రి ఎస్.జి.మూర్తి, డ్రైవర్), డి.వినయ్ కుమార్ (తండ్రి బి.పి.రావు డ్రైవర్)లకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణవేణి, ఎంకెనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు సిలిండర్లకు నాలుగు నిబంధనలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ కనెక్షన్ ఉన్న అర్హత గల ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా అందజేయనుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, తెలుపు రేషన్/బియ్యం కార్డు, ఆధార్‌తో లింకైన బ్యాంకు ఖాతా నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబరు కలిగి ఉన్నవారే అర్హులని స్పష్టం చేశారు. తొలి విడత ప్రయోజనం కోసం ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. తర్వాత నాలుగు నెలలకోసారి పథకం వర్తిస్తుందని తెలిపారు. ముందుగా బుక్ చేసుకుని ఎప్పట్లాగే ఏజెన్సీకి డబ్బులు చెల్లించాలని, లబ్ధిదారు అర్హులైతే వెంటనే మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుందని చెప్పారు. ఆ మొత్తం పట్టణంలో ఒక రోజులో, గ్రామీణ ప్రాంతంలో 3 రోజుల వ్యవధిలో బ్యాంకు ఖాతా జమ అవుతుందని వివరించారు.

బెలమరలో చైన్‌స్నాచింగ్

పోలాకి : ఈవినింగ్ వాక్‌కు వెళ్లిన మహిళ మెడలో గొలుసు తెంపి పారిపోయిన ఘటన పోలాకి మండలం బెలమర గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బెలమర గ్రామానికి చెందిన పొట్నూరు కనకరత్నం మరో ఇద్దరు మహిళలతో కలిసి వాకింగ్‌కు వెళ్లారు. డీపీఎస్ రహదారిపై వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన దుండగుడు కనకరత్నం మెడలోని గొలుసు తెంచి పారిపోయాడు. వెంటనే స్థానికులు అప్రమత్తమై బైకులపై వెంబడించినా దుండగుడి ఆచూకీ దొరకలేదు. తులంన్నర బంగారు గొలుసు పోవడంతో బాధితురాలు పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి క్రైంబ్రాంచి సిబ్బందితో కలిసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు న్యాయమూర్తులకు బదిలీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇద్దరు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజాం సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ వివేక ఆనంద్ శ్రీనివాసను శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ డిస్ట్రిట్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా నియమించారు. శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు, అడిషినల్ డిస్ట్రిట్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా ఉన్న పి.భాస్కరరావును శ్రీకాకుళంలోనే ఫస్ట్ అడిషినల్ డిస్ట్రిట్ అండ్ సెషన్సు కోర్టు న్యాయమూర్తిగా నియమించారు.

పాకశాలలో ప్లాంట్

- శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో నిబంధనలకు తూట్లు
- పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుపై విమర్శలు
- ఆలయ పవిత్రత దెబ్బతింటుందన్న భక్తులు



స్వామివారి పాకశాల

జలుమూరు:

దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగం ఆలయంలో స్వామివారికి బోగం, ప్రసాదం, కైంకర్యాలు తయారు చేసే పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇందులో తాగునీటి యంత్రాలు, పైపులు, ఇతర పరికరాలు ఏర్పాటు చేయడం వల్ల ఆలయ సంప్రదాయాలకు తిలోదాలకు ఇచ్చారని భక్తులు, ఆలయ అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో పాకశాలలోకి బోగం తయారు చేసే అర్చకులు మాత్రమే ప్రవేశం ఉంది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్ చేయడంతో నిర్వాహకులు, ఇతర వ్యక్తులు సరైన శుభ్రత పాటించకుండా లోపలికి వెళ్తున్నారు. కొందరు ఏకంగా గుట్కా,పాన్ మసాలాలు వేసుకొని పాకశాలలోకి ప్రవేశం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బయట వ్యక్తులు సైతం ప్లాంట్ కుళాయి వద్ద చేతులు, కాళ్లు, ముఖం శుభ్రం చేసుకుంటూ ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. స్వామివారికి బోగం తయారు చేసే సమయంలో నిర్దేశిత వంటవారు, అర్చకులు మినహా ఇతరులు ఎవరూ ఉండకూడదు. బోగం నివేదించిన సమయంలో ఎవరి కంట కనపడకుండా నియమ నిష్టలతో నివేదన చేయడం ఆలయ సంప్రదాయం. ఇక్కడ ఇవేవీ అమలు కాకపోవడంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.




పాకశాలలో తాగునీటి ప్లాంట్, యంత్రాలు

వేరేచోటకు మార్చుతాం..

దేవాలయం ఆలవరణలో తగిన స్థలం లేకపోవడంతో ప్లాంట్ పాకశాలలో ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీని వల్ల భక్తులకు అసౌకర్యం కలగడం వాస్తవమే. పాకశాల మిషన్లను వేరేచోటకు మార్చుతాం. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.

– నవీన్, కన్జర్వేటివ్ అధికారి, విశాఖపట్నం

పవిత్రతకు ముప్పు..



స్వామివారి ప్రసాదం, కైంకర్య, బోగాలు తయారు చేసే సమయంలో శుచి, శుభ్రత, గోప్యత ఉండాలి. ఇక్కడలా లేదు. తాగునీటి ప్లాంట్‌ను పాకశాలలో ఏర్పాటు చేయడంతో ఇతరులు వచ్చేస్తున్నారు. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు చొరవ తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలి.

– బసవ సుబ్బారావు, అర్చకులు, శ్రీముఖలింగం

నిర్లక్ష్య వైఖరి తగదు..



ఎంతో విశిష్టత గల దేవాలయంలో స్వామివారికి నివేదించే పాకశాల నిర్వహణను గాలికి వదిలేయడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ప్రసాదాలు, బోగం, కైంకర్యం తయారు చేసే పాకశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

– ఉమామహేశ్వరరావు, భక్తుడు, శ్రీకాకుళం

జగన్‌ను ఇబ్బంది పెట్టేందుకు షర్మిల కుట్ర



మాట్లాడుతున్న టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్

కోటబొమ్మాళి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపించి ఇబ్బంది పెట్టేందుకే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కుట్రలు, కుతంత్రాలకూ తెరలేపారని టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. శనివారం కోటబొమ్మాళి మండలం జర్జంగిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ షర్మిల కాంగ్రెస్‌లో ఉంటూ స్వార్థ రాజకీయాల కోసంటీడీపీ, జనసేన, బీజేపీతో స్నేహం చేస్తూ దొంగ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలు వెనుక ఎవరున్నారో త్వరలో బయటపడతారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి వచ్చాక హామీలను మరిచి ప్రజలను మోసగించిందని దుయ్యబట్టారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నారని, వారికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా బలమున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని, జమిలీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయదుందుభి మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లేశ్వరరావు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నేత దాడి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులో శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అనుచరుడు అల్లు రమణపై టీడీపీ నాయకుడు, పలాస మండలం వీరంద్రపురం గ్రామానికి చెందిన కొర్ల విష్ణు చౌదరి దాడి చేశాడు. అల్లు రమణ రోడ్డుపై మాట్లాడుతుండగా.. కారులో వచ్చిన విష్ణు చౌదరి కత్తితో రమణపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దాడి నుంచి తప్పించుకున్న రమణ ఆ కత్తిని పట్టుకుని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు.

అక్కడకు కూడా వచ్చిన విష్ణు చౌదరి స్టేషన్ సీసీ కెమెరాల ఎదుటే రమణపై దాడికి తెగబడ్డాడు. రమణకు తోడుగా వచ్చిన మొదలవలస మన్మథరావు పైన కూడా దాడి చేశాడు. ఈ ఘటనపై రమణ సీఐ మోహనరావుకి ఫిర్యాదు చేశారు.

డచ్ బిల్డింగ్ చుట్టూ ఉద్యానవనం

శ్రీకాకుళం/పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని 300 ఏళ్ల నాటి పురాతన డచ్ భవనం చుట్టూ ఢిల్లీ గేట్ తరహాలో ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి మంత్రి డచ్ బంగ్లాను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులు, భవనాల గ్రౌండ్‌లో దీపావళి సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పది కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి కేరళకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న పశ్చిమబెంగాల్ వ్యక్తిని ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బౌసి పుకుర్పరా గ్రామానికి చెందిన రైహ అలీ ఒడిశాలోని శేరఘడ గ్రామంలో 10.15 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి బస్సులో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు శనివారం ఉదయం చేరుకొన్నాడు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేయగా నిందితుడు పట్టుబడ్డాడు. అతని వద్ద బ్యాగులో 10.15 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. గంజాయిని కేరళలోని తిరూర్‌కు తీసుకెళ్లి రాఫీ అలియాస్ జలీల్ అనే వ్యక్తికి అందజేసేందుకు వెళ్తున్నట్లు పోలీసులు విచారణలో తేలిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు, క్రైమ్‌సిబ్బంది బషీర్, షబ్బీర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

సోంపేట: గంజాయి కేసులో నిందితుడిని కారులో శ్రీకాకుళం తీసుకెళ్తుండగా పాలవలస జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి 9.30 గంటల టైర్ పంక్చర్ కావడంతో బోల్తాపడింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, నిందితుడు రిహాన్ ఆలీకి స్వల్పగాయాలయ్యాయి. నిందితుడిని వేరే వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

బస్సు కిందపడి వ్యక్తి దుర్మరణం



సువ్వారి లోకనాథం(ఫైల్)

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే దారిలో కొత్తరోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ మండలం నందగిరిపేటకు చెందిన సువ్వారి లోకనాథం (35) కొన్నాళ్లుగా శ్రీకాకుళం బీసీ బాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని ఓ ప్రైవేటు కళాశాల బస్సులో ఇంటికి పయనమయ్యాడు. కొత్తరోడ్డు సమీపంలో ట్రాఫిక్ స్తంభించడంతో బస్సు నుంచి కిందకి దిగాడు. డ్రైవర్ ఈ విషయం గమనించక బస్సు నడిపించడంతో లోకనాథం టైరు కింద పడి మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కుమార్తె ఆమని, కుమారుడు కార్తీక్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

పట్టుబడిన పశువుల లారీ



పైడిభీమవరంలో పట్టుకున్న వాహనం ఇదే

రణస్థలం: అక్రమంగా కబేళాలకు తరలిపోతున్న పశువులను పైడిభీమవరం అవుట్ పోస్టు పోలీసులు శనివారం పట్టుకున్నట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఆమదాలవలస సమీపంలోని చింతాడ సంత నుంచి తుని వెళుతున్న కంటైనర్‌ను పైడిభీమవరంలో ఆపి తనిఖీలు నిర్వహించగా 19 పశువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కంటైనర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి చెప్పారు.

కోరుకున్న చోట కొలువు

- పలాస లైన్ ఇన్‌స్పెక్టర్‌పై ప్రభుత్వానికి మమకారం
- కొత్త పోస్టు సృష్టించి మరీ నియామకం

పలాస: రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకుంటే కోరుకున్న చోటకే కొలువు వచ్చి చేరుతుందనడానికి పలాస విద్యుత్ సబ్ డివిజన్‌లో జరిగిన తాజా నియామకమే ఉదాహరణ. పలాస లైన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన బి.కోదండరావు టెక్కలిలో లైన్ ఇన్‌స్పెక్టరుగా పనిచేసేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం రావడంతో ఆ పార్టీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు నమ్మిన బంటుగా ఉన్న ఒక నాయకుడు తనకు అత్యంత సన్నిహితుడైన కోదండరావును తన సొంత ప్రాంతానికి తీసుకురావాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆగమేఘాలపై సర్కిల్ ఆఫీసు నుంచి బదిలీ ఉత్వర్వులు ఇప్పించేశారు. వాస్తవానికి ప్రస్తుతం పలాస రూరల్, పలాస టౌన్, కాశీబుగ్గ టౌన్‌కు లైన్‌మేన్లతో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా రు. అయినప్పటికీ అదనపు పోస్టును సృష్టించి టెక్కలి నుంచి పలాసకు పోస్టింగ్ ఇప్పించారు. టెక్కలిలో ఇటీవలే లైన్‌మేన్ సింహాచలం మృతి చెందాడు. అక్కడి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరావు పలాసకు రావడంతో ప్రస్తుతం టెక్కలిలో విధుల నిర్వహణకుఎవరూ లేని పరిస్థితి నెలకొంది.

ఆరోపణలు ఉన్నా..

కోదండరావు గతంలో పలాసలో చేసిన సందర్భంలో పలు ఆరోపణలు వచ్చాయి. విద్యుత్ స్తంభాలు, మీటర్లకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు, అతని హయాంలో అక్రమంగా తీసుకొచ్చిన విద్యుత్తు స్తంభాలు నేటికీ ముళ్ల పొదల మధ్య మూలుతున్నాయని స్థానికులు చెబుతుంటారు. ఈ విషయమై పలాస ఈఈ జ్ఞానేశ్వరరావు వద్ద ప్రస్తావించగా సర్కిల్ ఆఫీసు ఉత్వర్వులు మేరకే కోదండరావును జాయిన్ చేసుకున్నానని స్పష్టం చేశారు.

రూ.24 లక్షల విలువైన 154 ఫోన్లు రికవరీ

- ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందించిన పోలీసులు
- సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోండి: ఎస్పీ



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే రికవరీకి వీలుంటుందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో ఇటీవల ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు రూ.24 లక్షలు విలువైన 154 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు 1600 ఫిర్యాదులకు గాను 772 ఫోన్లను బాధితులకు అందజేశామని చెప్పారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే తక్షణమే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది టెలికమ్యూనికేషన్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సిఇఐఆర్.జిఓవి.ఐఎన్ అనే వెబ్‌సైట్‌కి వెళ్లి బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకుంటే జిల్లాలోని సైబర్ సెల్ విభాగం రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుంటుందని, అనంతరం మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేస్తారని వివరించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

శ్రీకాకుళం క్రైమ్ : అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటీపీ, లింక్ క్లిక్, మాల్వేర్, ఏపీకే ఫైల్ తరహా నేరాలతో పాటు డిజిటల్ ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. వ్యక్తిగత వివరాలను అపరిచిత వ్యక్తులు, సంస్థలకు తెలియజేయకూడదన్నారు. బెదిరింపు వీడియోకాల్స్, ఫోన్ కాల్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

స్పాట్ అడ్మిషన్లకు సెట్ మినహాయించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏపీ పీజీ సెట్ అర్హతతో సంబంధం లేకుండా స్పాట్ అడ్మిషన్లు కల్పించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. వర్సిటీలో ఈ నెల 17 నుంచి 22 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించగా ఐదుగురు మాత్రమే సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు పొందారు. మరోవైపు 16 పీజీ కోర్సుల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి. 562 సీట్లకు 243 ప్రవేశాలు జరగ్గా 319 సీట్లు మిగిలిపోయాయి. స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటివి వర్తించకపోయినా విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే సెట్ ర్యాంకు తప్పని సరిచేయడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

మత్స్యకారుడు మృతి



పాకల గణపతి(ఫైల్)

గార: నదిలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకొని మృతి చెందాడు. గార మండలం కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలేం గ్రామానికి చెందిన పాకల గణపతి (41) శుక్రవారం ఉదయం వంశధార నదిలోకి చేపల వేటకు వెళ్లాడు. శనివారం కళింగపట్నం సంతతోట రేవు వద్ద మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నది ఊబిలో చిక్కుకుపోయి చనిపోయి ఉంటాడని తోటి మత్స్యకారులు భావిస్తున్నారు. ఏఎస్ఐ తెలుగు చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గణపతికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు



గాయపడిన తమ్మినేని రేవతి

ఆమదాలవలస: మండలంలోని జొన్నవలస సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మహిళా హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమదాలవలస ఎస్ఐ కె. వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఆమదాలవలస మున్సిపాలిటీ జగ్గుశాస్త్రులపేటకు చెందిన తమ్మినేని రేవతి శుక్రవారం నైట్ డ్యూటీ పూర్తి చేసుకొని శనివారం ఉదయం ఇంటికి వస్తున్న క్రమంలో జొన్నవలస వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయుధాలపై అవగాహన



గన్ పనితీరును వివరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: పోలీసుల విధి విధానాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలని, ఆయుధాలు, పరికరాల పనితీరు తెలుసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఓపెన్ హౌస్ (ఆయుధాలు, పరికరాల ప్రదర్శన) నిర్వహించారు. సాంకేతిక పరికరాలు, వివిధ రకాల ఆయుధాలు, వైర్‌లెస్ సెట్ కమ్యూనికేషన్, బాంబ్ డిస్పోజల్ సామగ్రి, పోలీసు జాగిలాల పనితీరు, డ్రోన్స్ వినియోగం, బాడీవార్న్ కెమెరాలు, బ్రీత్ ఎనలైజర్లు, పేలుడు పదార్థాల గుర్తింపు, సిగ్నల్స్, స్పీడ్‌గన్, గ్యాస్ గన్, నేర పరిశోధనలోను, బాంబ్‌లను గుర్తించే పోలీస్ డాగ్స్ పనితీరును ఎస్పీ వివరించారు. ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తుపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా జిల్లాలోని మూడు సబ్‌డివిజన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పోలీసు కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాలు, బ్లడ్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఇమ్మాన్యుయల్ రాజు, సూర్యారావు, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.